భయం భయంగా....

శ్రీ మురళీధర్

రామారావుకు బతుకంటే భయం. ప్రొద్దున్నే నిద్రలేస్తూనే సూర్యుణ్ణి చూడటమంటేనే భయం. వాడి వేడికిరణాలు కళ్లల్లో గుచ్చుకుంటాయని! నిద్ర లేవగానే కాఫీ తాగుదామని ఎంతో మనసు. ముఖం కడుక్కుంటేనేగాని కాఫీ యివ్వదు సరోజ. చిన్నప్పుడు అమ్మకూడా యింతే. పెద్దయిన తర్వాత, తనంతటి వాడు తానై, భార్యా పిల్లల్ని పోషించుకునే స్థితీ, వయస్సూ వచ్చినా తనకి కావలసినట్టు జరగదు తన యింట్లోనే. సరోజ మేనమామకూతురు కావటం ముప్పొచ్చింది నిజానికి.

గట్టిగా ఆలోచిస్తే (దానికీ భయమే మరి!) దేన్ని చూసినా భయం వేస్తోంది రామారావుకు. హైద్రాబాదులో ఇన్సూరెన్సు కంపెనీలో గుమాస్తా రామారావు గుడ్డి కన్ను మూసినా తెరిచినా ఒకటేనని మిత్రుల కథనం.

ఆమధ్య ఒకరోజున ఆఫీసుకు వెళ్లాలనిపించ లేదు రామారావుకు. సరోజ తలంటుకుని జుట్టు చిక్కు తీసుకుంటూ 'డ్రీమీ'గా చూస్తోంది అప్పుడు. ఒక్కసారి ఏదో అనిపించింది అంత మామూలుగా కనిపించే రామారావుకూను. ఒక్కసారి వెనకగావెళ్లి కళ్లు మూసి కటుక్కువ ముద్దెట్టుకుందామనిపించింది. కిటికీలోంచి కిరణాలు జారుతున్నాయి జలతారు పోగుల్లాగ. సరోజ బుగ్గమీదపడి మెరుస్తున్నాయి. కనిపించని ఒక్క క్షణం ఆగి ఆగి మురిపిస్తున్నాయి. సరోజ ఎలాఉందని ఆ క్షణంలో!

ఒక్కసారి మనస్సు ఝల్లుమంది. 'అబ్బ. వెధవ ఆఫీసు. వెధవ పాలసీలు. వెధవ ఉత్తరాలు. వెధవ చాకిరీ. వెధవ సూపర్నెంటు. వెధవ చివాట్లు. ఈక్షణం యిలాగే ఉండిపోతే సరోజ కళ్లల్లోకిచూస్తూ వళ్లోకి తీసుకుని ఉక్కిరి బిక్కిరి చేసేసి...'

'అలా నిలబడిపోయారేమండీ బెల్లం కొట్టిన రాయిలాగ? ఇవాళ ఆఫీసు ఎగ్గొడదామనా ఏమిటి, వేషం? అదేం కుదరదు' అని సరోజ అనేదాకా తెలివి రాలేదు. 'అబ్బెబ్బే, అదేంకాదు వూరికే నిల్చున్నా. చూస్తున్నా. అంతే.'

మరో నిమిషంలో రామారావు బస్‌స్టాప్ దగ్గర ఉన్నాడు. చేతిలో కాఫీ ఫ్లాస్కూ, అల్యూమినియమ్ టిఫిన్ డబ్బా, చెక్కిన పెనసలూ, యింకు నింపిన పెన్నూ, వో లాగూ చొక్కా, అరిగీ అరగని చెప్పులూ, సాగదీసి లెంపకాయకొడితే బిక్కముఖంవేసే ముఖాన్ని తగిలించుకుని.

బస్సెక్కి తిన్నగా ఆఫీసుకు వంటిని చేరవేసాడు. బల్లమీద కాగితాలకట్ట 'రెడీ'గా ఉంది. రామారావు ఆఫీసుకురాగానే ఫ్లాస్కులోంచి కాఫీ తాగబోయే ముందర మరో పెద్ద గుమాస్తాకు యిస్తాడు. 'తప్పేదేమిటోయ్ కాఫీ తాగటం? అందులో యింటి కాఫీ వదులుకోవటం ఏమిటిలే' అని గటాగటా తాగేస్తాడు. 'ఈ కాగితాలు సరిగ్గా ఉన్నాయేమో చూడవోయ్. నాకు మహా విసుగ్గాఉంది' అని తోటి గుమాస్తా అప్పారావు మరికొన్ని కాగితాలు తోసేస్తాడు. సాయంత్రం మూడు గంటలకి టీ తాగి 'యింకా కాలేదు టోయ్' అని గదమాయించి తర్వాత మరో అరగంటకి ఒక మెహర్బానీ చిరునవ్వు విసిరి కాగితాలు గుచ్చెత్తి తీసుకుపోతాడు. ఆఫీసు అయిపోయేలోగా ఒక్కప్యూన్లు తప్ప మిగతా వాళ్లంతా ఏదోరకంగా రామారావుచేత చాకిరీ చేయించుకుని ఉద్ధరించే వాళ్లే.

ఆవాళ సూపర్నెంటు పిలిచి'ఏమిటోయ్' రామారావ్! మరీ అయోమయంగా ఉంది నీ వ్యవహారం. నీకు పనిమీద ధ్యాసలేనట్టుగా ఉందే చూస్తే' అన్నాడు. ఏదో మ్యావు మ్యావు మని సమాధానం చెప్పి తప్పుకున్నాడు, రామారావు.

ఇంటికి రాగానే సరోజ పలకరించనైనా లేదు. ఇటూ అటూ చూశాడు. అరిగిపోయిన పెన్సిలూ,

పెన్, మిగతా చిత్తు కాగితాలూ తీసి గదిలోని టేబిల్ మీద పెట్టాడు. తగిలించుకున్న 'ఫ్లాస్క్' కూడా చిక్కు విడదీసినట్లు పక్కకు పెట్టాడు. ఆఫీసుకు వెళ్లేటప్పుడు ఒక సంచీ మడతపెట్టి తీసుకు వెళ్లటం అలవాటు. ఇంటికి వచ్చేటప్పుడు కూరలు తీసుకు రావటం ఒక డ్యూటీ. 'ఇన్నేళ్లబట్టీ కూరలుతెస్తూన్నా పుచ్చువంకాయలూ, వడిలిపోయిన అరటికాయలూ, ముదిరిపోయిన బెండకాయలూ తప్ప మంచి కూరల కూడా తేవటం తెలియదు. ఏంచేస్తాం ఖర్మ? దేనికైనా పెట్టిపుట్టాలి' అని విసుక్కుంది సరోజ. ఆ రకంగా విసుక్కోవటం కూడా కొత్తకాదు.

రాత్రి భోజనం చేస్తూ 'అన్నంలో రాళ్లున్నట్లున్నాయి' అన్నాడు రామారావు.

'రాళ్లుండక రత్నాలుంటాయేమిటి, మరీ చోద్యం' అంది సరోజ. అవాళ రాత్రి ఏదో ముక్కుతూ మూలుగుతూ పడుకున్నాడు.

మర్నాడు పొద్దున్న లేవ బుద్ధి కాలేదు రామారావుకు. ఆలస్యంగా లేచే అలవాటులేదు రామారావుకు. ఒకవేళ లేస్తే వూరుకునే అలవాటు అంతకన్నాలేదు సరోజకు. ఎంతసేపూ లేవకపోయేసరికి కస్సుమంది. 'మీరు ఎంతసేపు పక్కతూదనుంచి లేవకపోయినా మీకు పక్కమీదకు కాఫీ యిచ్చేదిలేదు. అయినా ఆఫీసూ వ్యవహారం అదీ లేదేమిటి' అన్న మాటలతో రామారావు మత్తు కాస్తా వదలిపోయింది.

లేచి ముఖం కడుక్కుని కాఫీ తాగి ఆఫీసుకు తయారై గానుగఎద్దులాగ వెళ్లబోయేసరికి సరోజ అంది 'అమ్మయ్య, యిప్పుడు ప్రజల్లో పడ్డారు' అని. ఏదో అందామని నోటిదాకా వచ్చినదికాని మళ్లా గడియారం చూపిస్తోన్న సరోజను చూసి ముఖం చిట్లించుకుని వెళ్లిపోయాడు బస్స్టాప్ దగ్గరకు.

ఈ రకంగా రామారావు జీవితం జీతంలాగా ఎదుగూ బొదగూ లేకుండా వెళ్లిపోయి ఉండవలసింది. మరో పాతికేళ్లు ఉద్యోగం చేసి పెన్షన్ పుచ్చుకుని యింకా బతికుంటే యిన్సూరెన్సు పుచ్చుకుని, మరో కాసిని ఏళ్లకి నిక్షేపంగా చచ్చిపోవచ్చు. ఈలోగా పుట్టిన కొడుక్కో, కొడుకులకో తద్దినం రోజునైనా తప్పకుండా జ్ఞాపకాని కొచ్చేవాడు. సరోజ కూడా సహజంగా వార్ధక్యంవచ్చో, జబ్బుచేసో కాస్త ముందో, కాస్త వెనకో, కాలూ చెయ్యి పడిపోయో యీ లోకాన్నుంచి జారుకుని ఉండేది. అంతకన్న మరేమీ ప్రమాదం జరిగి ఉండేదికాదు. వూళ్లో వాళ్లకిగాని, దేశంలో వాళ్లకిగాని ఏమీ అనిపించేదికాదు గూడాను. కనీసం పత్రికల్లో కూడా మరణ వార్త ప్రచురించబడేదికాదు, పిల్లలు డబ్బిచ్చి ప్రకటనగా వేయిస్తే తప్ప.

సరోజ పుట్టింటినుంచి అత్తవారింటికి రావటానికి పెద్ద సరదా పడనూలేదు. మరీ నిర్లక్ష్యమూ చూపలేదు. పొయ్యిమీద అన్నం గిన్నె దింపి విస్తట్లో వడ్డించుకు తిన్నంత మామూలుగా చూసింది కాపరానికి రావటాన్ని. రామారావుకుమాత్రం కాస్త మనసు పడ్డాడు. మీనాక్షమ్మగారుమాత్రం ఎప్పుడైనా అనేది, 'ఇప్పుడు నన్నేడిపిస్తున్నావా, యింక దాన్ని ఏడిపిస్తావనుకుంటా' అని. ఏడిచేవాళ్లకి ఎదుటవాళ్లని ఏడిపించటం చేతకాదు. ఆ సంగతి మీనాక్షమ్మగారికి తెలియదు. తండ్రి రంగనాథంగారు ఎప్పుడూ అందలం ఎక్కి తిరిగినవాడుకాదు. ఏడవటానికీ, నవ్వటానికీ పెద్ద తేడా అంతకన్నా తెలియలేదు ఆయనకి బతికుండగా. ఏదో కొడుకు బతికి బాగుంటే చాలు అని సరిపెట్టుకుపోయే శ్రేణిలోవాడు. అదిగాక కాస్త చదువుకుని నాలుగురాళ్లు సంపాదించటం మొదలెట్టే సరికల్లా మహా గాభరా పడిపోయారాయన. ఆయన గాబరా మాట ఎలా ఉన్నా చుట్టుపక్కలవాళ్ల గాబరాఎక్కువైంది. రామనాథంగారికిమూడేళ్లముందే రిటైరైన గుర్నాథంగారు మూడు రోజుల కోసారి పని కట్టుకుని వచ్చి వసారాలో బైఠాయించి 'మీవాడు ఏం చేస్తున్నాడోయ్' అని సమాధానంకోసం ఆగకుండానే 'ఆ ఏం చేస్తాడు, బాధ్యతా ఏమన్నానా.....' అని యింకా సమాధానం ఏమీ రాకపోవటంతో, 'అయినా మనం ఏం చెప్పగలం యీ కాలపు కుర్రకారుకు' అని కండువా బుజాన వేసుకు వెళ్లిపోయేవారు.

ఇలా ఒక మూడు నెలలు 'స్లోపాయిజనింగ్' లాగ గుర్నాథం రామనాథంవాళ్లఅబ్బాయి క్షేమంకోసం ఆత్రుత చూపించేసరికి నిజంగానే పరిస్థితి ఏదోఅయోమయంగా కనిపించింది ఆయనకి. 'ఏమే, అబ్బాయి వేళకి యింటికి వస్తున్నాడా? ఇంటి పట్టున ఉంటున్నాడా? దుబారా చేస్తున్నాడా?' అని అడిగాడు భార్యని ఒక రోజున.

'ఇదేం చోద్యం నన్నడుగుతారు. మీ తండ్రీ కొడుకులు ఏం జేసుకుంటున్నారో నాకేం తెలుసు గనక. నా వంటిల్లూ, నేనూను' అని వార్పు కొచ్చిన అన్నపు గిన్నెవైపు వెళ్లిపోయింది.

ఆ ఆదివారం రాత్రి కాస్త ఆలస్యంగావచ్చాడు రామారావు.అంతే. ఒక్కసారి లేచిపోయాడుపైకి, 'ఏరా, యివాళ నాలుగు రూపాయిలు సంపాదిస్తున్నావుగదా అని కులాసాగా సినిమాలూ, స్నేహితులూ అని తిరుగుతున్నావు. రేపు నీకూ ఒక పెళ్లాం అంటూ వస్తే యీ దుబరా ఖర్చు ఎలా కుదురుతుంది? కొంచెం వళ్లు దగ్గరుంచుకుని మెసలుకో'' అని హెచ్చరించారు.

'పెళ్లాం వస్తే దూబరా ఖర్చు వీల్లేదు గనకే యిప్పుడైనా నన్ను కాస్త కులాసాగా తిరగనీ' అని అందామని ఆయనమాటే ఆయనకు ఒప్పజెబుదామని తెగ మనసుపడ్డాడు. గొంతులోంచి మాటలు నాలిక చివరిదాకా వచ్చి కూడా వెనక్కు వెళ్లిపోయాయి. గ్యాస్ పోయిన సోడాబుడ్డి ముఖం వేసుకుని వెళ్లిపోయాడు యింట్లోకి. 'కాళ్లు కడుక్కో, భోజనం చేద్దువుగాని. అయినా బయట ఏదో గడ్డి తినేవచ్చి ఉంటావనుకో' అని అన్నం వడ్డించింది ఆవిడ. అన్నం సయించనూ లేదు. తినక తప్పనూలేదు.

'మహా గొడవగా ఉందే, ఎప్పుడు స్నేహితులతో కాస్త సినిమాకి వెళ్లినాను? చెప్పెయ్యాలి నేను చంటిపిల్లాడిని కాదని, ఉద్యోగం చేసుకుంటున్నాననీ, నా ఖర్చులు నా కుంటాయని. నా స్నేహితులు, నా అలవాట్లు నావని' చెబుదామనుకున్నాడు. ఒక్కసారి చెప్పవలసినవల్లా చెప్పేసి తేల్చేసుకోవాలి అనుకున్నాడు రామారావు. బాగానే ఉండేది తేల్చేసుకుంటే. కాని ఆ ఆలోచన మనస్సులోనే ఉండిపోయింది మరికొంత కాలం దాకా.

ఈలోగా మహా తొందరపడిపోయాడు రామనాథం. 'ఎందుకు అంత గాబరా, మన సరోజలేదూ' అన్నది మీనాక్షమ్మ. ఇంటికి వెల్లవేసినట్లూ, తలుపుకు వార్నీసు వేసినట్లూ, రామారావు పెళ్లి రామారావుతో నిమిత్తం లేకుండా అయిపోయింది. గొంతులో మాట నాలిక చివరిదాకా వచ్చినా, అక్కడితో ఆగి పోవలసిందేనని రామారావుకు తెలిసొచ్చింది.

రామారావు గృహస్థుడయ్యాడని తెలుసుకునేటప్పటికి రామనాథం, మీనాక్షమ్మ వంతులవారీగా యీ లోకాన్నుంచి దాటుకోవడమూ, సరోజ యింటి పెత్తనంతోబాటు భర్తపై అజమాయిషీ కూడా చలా యించటమూ అమలులోకి వచ్చేసాయి! పాతకాలపు మిత్రులు కనిపించి అదోలా చూసేవారు రామారావుని. ఏకాలో చెయ్యో విరిగో, పక్షవాతం వచ్చి ఒక వైపంతా చచ్చుపడిపోయినప్పుడు చుట్టు పక్కలవాళ్లు చూసే సానుభూతిలాంటిది చూపించటం మొదలెట్టారు. 'పాపం రెండు ఉద్యోగాలు రామారావుకి—బయట ఆఫీసు ఉద్యోగం, యింట్లో భార్యా ఉద్యోగమూను, పాపం' అంటూ వేళాకోళం చేసేవారు.

నిజానికి రామారావు చేదు మేస్తున్నాడా అంటే 'చేదు అంటే ఏమిటి? నీకు చేదు అనిపించేది మరొకళ్లకి తీపి అనిపించవచ్చు. అంత అనుకూలవతియైన భార్య దొరకటం ఎంత అదృష్టం' అనేవాళ్లూ ఉన్నారు. కాని ఆ మాటలు కేవలం ఎదటి వాళ్లచేత కాదనిపించుకోటానికో, లేక వ్యంగ్యాన్ని సూచించటానికోనని తెలుసుకోవటానికి మరి ఎక్కువ సేపు పట్టదు.

రామారావుచొప్పగడ్డలాంటి బతుకులో మార్పు, మరేమిటి, విప్లవం రావటానికి కారణం ఉప్పెనలాగ కొన్ని సంఘటనలు జరగటమే.

రోజూలాగే ఆఫీసుకు వెళ్లాడు రామారావు అవాళ కూడా. ఫ్లాస్కులో కాఫీ పెద్దగుమస్తాకు యివ్వలేదు. ఇవ్వక పోవటానికి ప్రత్యేకమైన ఆలోచన ఏమీలేదు మరి. ఆయన ఒకటి రెండు సార్లు పని ఉన్నట్లు పిలిచాడు. పిలిచిన పని చూసుకుని మళ్లా 'సీట్'లోకి కూర్చుని పని చేసుకున్నాడు. మరో గంట పోయిన తర్వాత ఏదో మరిచిపోయినట్టు రామారావు దగ్గరకు వచ్చాడు. 'చాలా శ్రద్ధగా పని చేస్తున్నట్లున్నావ్' అని, రామారావు గాబరా పడకపోవటం చూసి, 'అరే, యివన్నీ నువ్వు చూసేసిన ఫైల్సే' అని మరికాస్త ఆశ్చర్యాన్ని ప్రకటించాడు. 'ఊ' అని కొంచెం పక్కకు తిరిగి ఏదో మరిచిపోయినట్లనిపించి 'మీకు కాఫీ ఇయ్యలేదు.....' అన్నాడు.

'ఫర్వాలేదు. ఇంచుమించు రోజూ తాగుతూనే ఉన్నానుకదా' అన్నాడు పెద్ద గుమాస్తా మొదటి సారిగా.

మరి కాస్సేపున్న తర్వాత అప్పారావు వచ్చాడు రెండు ఫైళ్లు పుచ్చుకుని 'ఈ ఫైళ్లు...' అని మాట పూర్తి చెయ్యక ముందే 'ఇప్పుడు పని తొందరలో ఉన్నాను, చూడటం కుదరదు' అన్నాడు ఏ లోకంలో ఉన్నాడో మరి.

అప్పారావు ఒక్కసారి 'షాక్' తిన్నాడు. ఎవరు యీ మాట్లాడుతున్నది? రామారావా; రామారావు భూతమా? ఇది ఎలా సంభవం? అని గుంజు కుంటూ వెళ్లిపోయాడు, మైకంలో ఏమీ అడగకుండానే.

అవాళ సూపర్నెంటు పిలిచి 'ఏమిటి, ఏదొచ్చినా కష్టమేనే నీతో. వారరోజుల పనీ ఒక్కరోజులో చేసేశావా, లేకపోతే వారంరోజుల బట్టీ పేరబెట్టి ఇవాళ కాగితాలన్నీ కట్టకట్టి పంపించావా?' అన్నాడు.

రామారావుకు ఏదో అనిపించింది. ఏదో కొత్తగా ఉంది చూస్తే. చాలా చెబుదామనుకున్నాడు. ఇప్పటి దాకా తను అప్పారావు బోటి తోటి సోదర గుమా స్తాల పని కూడా నెత్తిన వేసుకు చేస్తున్నాడనీ, తనకు ప్రోత్సాహం యిస్తే యింకా ఎక్కువ పని కూడా చెయ్యగలడనీ.. పెద్దగుమాస్తా తనని పురుగు లాగ చూస్తున్నాడనీ యింకా యింకా ఎన్నో... తనకు జరుగుతూన్న అవమానాల్ని గురించి ఎన్నో ఎన్నో చెబుదామని అనుకున్నాడు. మళ్లా అలావాటు ప్రకారం నోట్లో మాట నాలిక చివరి దాకా వచ్చి ఆగిపోయింది. 'అవునండి. మరండి...' అంటూన్న మాటల్ని వినిపించుకోకుండా నవ్వు కుంటూ వెళ్లిపోయారు ఆయన బయటికి.

ఆ విధంగా ఎందుకు అనిపించిందో అర్థం కాలేదు. సీట్లో కూర్చున్న తర్వాత రామారావుకి పని చెయ్య బుద్ధి కాలేదు. అటుచూస్తే ఆ వారం లోనే కొత్తగా టైపిస్టుగా వచ్చిన నిర్మలతో అప్పారావు బాతాకానీ వేస్తున్నాడు. ఆ అమ్మాయి ముఖం చిట్లించుకున్నా యింకా ఏదేదో చెబు తున్నాడు అప్పారావు.

రామారావు గబగబా లేచి వెళ్లి నిర్మలకు తనను తాను పరిచయం చేసుకున్నాడు. అప్పా రావుకు ఎందుకో అది నచ్చలేదు. 'ఈ పురుగు ఎవరు' అన్నట్లు చూసి ఏదో అనబోయి విసురుగా వెళ్లిపోయాడు. ఎప్పుడు వదిలించుకుంటావూ అనుకుంటూన్న నిర్మలకి 'రిలీఫ్' అనిపించింది.

'మీకు ఏమైనా తెలియకపోతే...'

'థాంక్స్'

అవాళ సాయంత్రం కూరలు తీసుకు వెళ్లలేదు రామారావు. 'పని అంత ఎక్కువగా ఉందా' అని అడిగింది సరోజ.

'ఉంటుంది' అన్నాడు నిర్లక్ష్యాన్ని సూచించే టట్లు.

'ఇవాళ పొద్దున్నుంచే చేస్తున్నారా యీ ఉద్యోగం?'

'రేపట్నుంచి యింటి దగ్గరకు వచ్చిన వాళ్ల దగ్గరే కొను' ఇంకా అదే ఫక్కీలో మాట్లా డుతూ.

'అంతటితో ఆగారు. నన్నే వెళ్లి కొనుక్కో మ్మన్నారు కాదు యింకా'.

'నువు వెళ్లి కూరలు కొనుక్కుంటే తప్పేమిటి? పుచ్చులు లేని వంకాయలు, లేత బెండ కాయలు..' అలా అంటూ ఉండాలనిపించింది. ఆ విధంగా మాట్లాడుతూంటే ఏదో గమ్మత్తుగాఉంది.

'మీకేమయింది యివాళ? ఆఫీసులో ఏమన్నా గొడవలు అయ్యాయా?'

'అంతా సవ్యంగానే ఉంది' అన్నాడు పార్టన్ మరిచిపోని 'ఏక్టర్' లాగా, 'నిల్చోబెట్టి ప్రశ్నలు అడగటం చాలు అనుకుంట' అని ముగిస్తూ.

మరో వారంరోజులు నిజంగా వరౌనంగా గడచింది. యాంత్రికంగా. సరోజ 'డ్యూటీ' చేసి నట్లు వంట చేసి పెట్టటం, కారియర్‌లో టిఫిన్, ఫ్లాస్కులో కాఫీ పోసి యిస్తూనే ఉంది. 'ఉండి ఉండి యీ మనిషికి ఏమైందీ' అనుకుంది లోపల సరోజ.

ఈ వారంలో ప్రతిరోజూ అప్పారావు ఏవో కాగితాలు రామారావు పైకి విసరటమూ, రావా

తావు వాటిని తిప్పి కొట్టటమూ జరిగింది. దానికో ప్రత్యేకమైన కారణంలేదు. సూపర్నెంటు రామారావంటే చాలా గౌరవంగా మాట్లాడటం మొదలు పెట్టాడు. పెద్దగుమాస్తా అదే విధంగా సర్దుకున్నాడు.

ఒకరోజున 'కాంటీన్'లో నిర్మల కాఫీ తాగుతోంది యింటర్‌వెల్‌లో. రామారావును చూసి 'విష్' చేసింది. 'కాఫీ తీసుకుంటారా' అంది.

'ఊహు'

'మీరు యింటి కాఫీగాని తాగరనుకుంట.'

'ఇవాళ తీసుకు రాలేదు.'

'అయితే తీసుకోండి' అని రామారావు వద్దంటూన్నా కాఫీ తీసుకువచ్చి యిచ్చింది.

ఒక 'కార్నర్ సీట్'లో కూర్చొని రామారావు వైపే చూస్తోంది.

'నేను చాలా విచిత్రంగా కనిపిస్తున్నాను కదూ' అన్నాడు నిర్మలతో రామారావు ఏదో మాట్లాడాలి గనక.

'మీరు విచిత్రంగా కనిపించరు గాని,మిమ్మల్ని గూర్చి విచిత్రంగా చెప్పుకుంటారు...'

రామారావు సమాధానం చెప్పలేదు. ఆపు చెయ్యనూ లేదు.

'నేను యీ ఆఫీసుకు కొత్తగదా, ఎంత కాలం బట్టో మీరంతా కలిసిమెలిసి పని చేస్తున్నారు గదా, ఒకళ్లమీద ఒకళ్లకి...'

ఈలోగా ఎవరో అక్కడికి రావటంతో వాళ్లిద్దరూ అక్కడనుంచి లేచి వెళ్లిపోయారు.

అవాళ సాయింత్రం ఆఫీసు కాగానే అప్పారావు యించుమించు కాళ్లకు అడ్డం తగిలాడు.

'ఏం గురూ, కనిపించటం మానేసావు'

'అవును రామారావు యీమధ్య ప్రజల్లో పడుతున్నాడు'

'రామారావు సూపర్నెంటు' 'యింప్రెషన్' కొట్టేస్తున్నాడు.'

'రామారావులో వస్తూన్న మార్పులు రావటానికి కారణం నాకు తెలుసు.'

'పిల్లి కళ్లుమూసుకుని పాలు తాగితే..' వడుస్తూ నడుస్తూ 'జంక్షన్'లోని హొటల్ దాకా వచ్చారు.

'రామారావు మనందరికీ కాఫీ యిప్పిస్తాడు'

'అవును యిప్పిస్తాడు.'

'ఆ మాత్రానికి వెనక్కి పోతాడేమిటి?'

'అవును, వెనక్కి పోతాడేమిటి?'

'కాఫీ తాగ దలుచుకుంటే తాగండి. నాకేమీ అభ్యంతరం లేదు' అన్నాడు రామారావు.

'పాపం వాళ్ల ఆవిడ నెలకి యింతని పై ఖర్చుకి డబ్బు యిస్తుంది..'

'అది ఏ కూరలకో అయిపోయి ఉంటుంది'

'ఇహిహిహి'

'ఇహి... యిహి... హిహిహి'

'అదికాదు మీరు నా డబ్బుతో కాఫీ తాగ దలుచుకుంటే'

'పోనీ ఎవరి డబ్బులు వాళ్లు.. సోల్జర్ సిస్టమ్....'

'అమెరికన్ సిస్టమ్'

'రైటో'

కాఫీ తాగుతూన్నంత సేపూ అప్పారావు నిర్మలని గురించి ఏమిటేమిటో చెబుతూనే ఉన్నాడు. ఆ అమ్మాయి అంతకుముందు ఎంత మందినో దగా చేసిందనీ అసలు యిక్కడ ఉద్యోగంలోకి రావటంలో ఉద్దేశ్యం కూడా ఏదో ఉందనీను. అసలు రామారావు అమాయకుడు గనక, అభమూ శుభమూ ఎరుగనివాడు గనక, భార్యా సంసారం ఉన్నవాడు గనక, ఆ నిర్మల, చనువుగా మాట్లాడినా తనని మాట్లాడవద్దని చెప్పాడు అప్పారావు. మిగతా మిత్రులు అప్పారావు చెప్పిన దాన్ని మరీ మరీ నొక్కి చిలవలూ పలవలూ కల్పించి చెప్పారు.

అప్పారావూ మిత్రులూ వదలగానే యింటికి వచ్చాడు రామారావు. సరోజ ముఖం ముడుచుకుంది ఆలస్యంగా వచ్చాడని. మరో రోజైతే మరేవన్నా అనేవాడేమో? కాని అవాళ రామారావు

కిమ్మనకుండా కూర్చున్నాడు, ఏదో పాతపత్రిక తిరగేస్తూ. సరోజ మాట్లాడకుండా తనమానాన్న తన్ను వదిలెయ్యటం ఎంతో హాయిగా ఉన్నట్లుగా ఉంది అతని ప్రాణానికి.

మొట్టమొదటిసారిగా తనకి తానుగా ఉండటానికీ యిదంతా ఏమిటని ఆలోచించటానికీ అవకాశం దొరికింది— గానుగెద్దులాగ తన ప్రమేయం లేకుండా సాగిపోతూన్న బతుకుని ఒక్కసారి సింహావలోకనం చేసుకోవటానికి.

తను ఎవరు యింతకీ? అమ్మా నాన్నా కనిపెంచి అత్తెసరు చదువు చెప్పించి గుమాస్తా ఫ్యాక్టరీలోకి తోసి తన యిష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా మరో జీవిని పట్టుకొచ్చి తన జీవితానికి ముడివేసి తమ కర్తవ్యం తీరిపోయిందని, నిశ్చింతగా వెళ్లిపోయినందుకు ఒక్కసారిగా కసిగా కోపం వచ్చింది. ఎదురుగా ఉంటే సాగదీసి అడిగేద్దామనుకున్నాడు. కనీసం ఫోటోలు— మొన్న తద్దినం నాడు దండ వేసిన ఫోటోలు పగలగొటేద్దామనుకున్నాడు. దాని వలన కలిగే లాభం ఏమీ లేదని తెలుసుకునే సరికి ఉత్సాహం పైన నీళ్లు చల్లినట్లయింది.

అవును, తను యింతకీ ఎవరు? అందరూ యంత్రం లాగ వాడుకుంటున్నారు? భర్త అయిన నేరంగా యీ సుఖంలేని సంసారం భరించవలసి వస్తోంది. ఉద్యోగి అయిన నేరంగా తనకు యిష్టం లేని ఉద్యోగాన్ని సహించవలసి వస్తోంది. ప్రొద్దున్న లేచినది మొదలు పడుకోబోయే దాకా తను ప్రతివాడికీ లొంగిపోతున్నాడు. ప్రతివాడూ తన చెవి మెలిపెట్టి తమకు కావలసిన పని చేయించుకుంటున్నారు. అది గాకుండా యింకా తన మీదే అజమాయిషీ చేస్తున్నారు? ఎందుకిలా అవుతోంది? అవుతోందా, లేక తనే యీరకంగా అవనిస్తున్నాడా?

రామారావుకు నిద్ర పట్టలేదు, ఆరాత్రి. అర్ధరాత్రి వేళ లేచి పక్కకు చూసాడు. సరోజ నిశ్చలంగా నిద్రపోతోంది. మరెప్పుడైనా మరేమన్నా అనిపించేదేమో? కనీసం సరోజను నిద్ర లేపేవాడు, కిటికీ చాటున యింకా దాక్కున్న చందమామని చూడమనో, ఆకాశంలోని మబ్బుల్ని చూడమనో, లేక పక్కింటివాళ్లు కట్టెయ్యని రేడియోలో పాట వినమనో. కాని రామారావు సరోజ నిద్రాభంగం చెయ్యలేదు. ఆక్షణంలో సరోజ ముఖం ఎందుకో అంత అమాయకంగా కనిపించనేలేదు. పక్కమీదనుంచి లేచి అటూ యిటూ పచార్లు చేసి పడుకున్నాడు. తెల్లవారు ఝామున కునుకు పట్టబోయేసరికి సరోజమీద కాలు వేసింది అలవాటుగా. మరొకప్పుడైతే తను కూడా అలవాటుగా సరోజ పక్కకు తిరిగేవాడు. కాని మెల్లిగా ఆ కాలు పక్కకి తప్పించాడు. ఒక్కసారి ఉలిక్కిపడి లేచింది సరోజ, 'ఏమిటండీ పడుకోలేదూ' అంటూ. 'పీడకల ఏమన్నా రాలేదు కదా?'

ప్రొద్దున్న నిద్ర లేచిన సరోజకు ఏదో వెలితిగా ఉంది. కాఫీ యిస్తూ అంది. 'ఏమిటి, యీమధ్య మీరు అదో రకంగా ఉంటున్నారు' అని.

'సరిగ్గానే ఉన్నానే'

'ఆరోగ్యం బాగానే ఉంటున్నదా'

'చూస్తూనే ఉన్నావుకదా?'

ఇంక ఏమి మాట్లాడటానికీ తోచలేదు సరోజకు. ఏదో అనిపిస్తోంది. కాని దానిని స్పష్టంగా చెప్పలేక పోతోంది. ఏమిటది?

ఆఫీసులో అందరితోనూ ముభావంగానే ఉంటున్నాడు. నిర్మలతో పరిచయం ఎక్కువైంది. రోజూ 'ఫ్లాస్కు'లో కాఫీ, పెద్ద గుమాస్తాకి బదులు నిర్మలకి ఇవ్వటం మొదలుపెట్టాడు. ఇది ఎవ్వరికీ నచ్చలేదు. పెద్ద గుమాస్తాకి కూడాను. కాని ఏమీ అనలేక పోతున్నారు కూడాను.

ఆఫీసులో ఒకళ్లంటే ఒకళ్లకి పడదనీ, అంతకుముందు గాడిద చాకిరీచేస్తూ, అందరికీ అడిగి మడిగి ఉండే రామారావు మనిషిలాగ మసలుకోవచ్చేసరికి వాళ్లంతా ఎడముఖం పెడముఖం పెట్టారనీ తెలుసుకోవటానికి ఎక్కువ రోజులు పట్టలేదు చురుకుపాలున్న నిర్మలకి.

ఉన్నట్టుండి ఒక రోజున 'మీ యింటికి రావాలని ఉంది. మీ వాళ్లని పరిచయం చెయ్యరూ' అంది నిర్మల.

రామారావుకు అర్థం కాలేదు, ఏమి చెప్పాలో. అవునంటే ఒక చిక్కు, కాదంటే మరో చిక్కూను.

అవాళ సాయంత్రం ఆఫీసునుంచి సరాసరి నిర్మలని తీసుకుని యింటికి వెళ్ళాడు. సరోజ తలుపు తీస్తూనే ఆశ్చర్యం ఒలకబోసింది. నిర్మలని పరిచయం చేసాడు:

''ఈవిడ మా ఆఫీసులో పనిచేస్తారు.''

కాఫీతాగి ఏదో కబుర్లుచెప్ప పంపించేసాడు రామారావు. నిర్మల వెళ్లిపోయిన తర్వాత సరోజ సరిగ్గా మాట్లాడలేదు కాస్సేపటిదాకా. నిర్మలని గూర్చి తనకు తానుగానే చెబుతాడనుకుంది. కాని మామూలుగా ఊరుకునేసరికి సరోజకి ఏమి అనాలో తోచలేదు.

మర్నాడు కొంచెం ఆలస్యంగా యింటికి వచ్చేసరికి సరోజ గుమ్మం దగ్గరే కాపలా వేసింది.

'ఏమండీ, మీరు యింత ఆలస్యంగా వస్తే....'

'వస్తే......'

'ఇల్లూ అదీ పట్టకుండా తిరుగుతూ ఉంటే'

'ఉంటే'

రామారావు లోపలకి వచ్చి కాస్సేపున్నతర్వాత టీ కప్పు అందిస్తూ 'అయినా మీకు తీరిక ఎక్కడ...'

'వీళ్లతో వాళ్లతోనే తిరుగుతారా, యింటికే వస్తారా'

రామారావు పేలుసుగా ఏదో సమాధానం చెప్పేద్దామనుకున్నాడు.

'మీరు......'

'మాట తప్పించటంలేదు నేనుగాని, మనం తర్వాత తీరికగా మాట్లాడుకోవచ్చు. ఇప్పుడేగా యింటికి వచ్చింది?'

సరోజ బిక్కముఖం వేసింది. ఈరకంగా తను భరించలేనన్నది.

అవాళ రాత్రి రామారావు సరోజతో ఎంతో ముచ్చటగా మాట్లాడాడు. సరోజ ఉక్కిరి బిక్కిరి అయిపోయింది. ప్రేమలో పడ్డదానికి మల్లే ఎంతో మత్తుగా రామారావు కళ్లల్లోకి చూస్తూ రాత్రంతా గడిపేసింది. మొదటిసారిగా వాళ్లిద్దరూ ఏకాంతంలోని మాధుర్యాన్ని జుర్రుకున్నారు. తెల్లవారుఝామున మగత నిద్ర పట్టింది.

'అరెరె, ఆలస్యం అయిపోతోంది సరోజా, ఆఫీసుకు' అన్నాడు, పక్కమీదనుంచే. లేచి మంచం దిగేలోపలే కాఫీ యిచ్చింది రామారావుకు సరోజ.

'ముఖం కడుక్కోనీ'

'కడుక్కోవచ్చు లెద్దురూ కాఫీ త్రాగి.....'

అప్సరసవచ్చి అమృతం అందిచ్చినట్లుగా ఉంది రామారావు ప్రాణానికి. కాఫీ త్రాగి ముఖం కడుక్కుని స్నానం చేసి రాగానే టిఫిన్ రెండు ప్లేట్లల్లో పెట్టి 'రెడీ'గా ఉంది సరోజ.

'ఇప్పుడు టిఫిన్ ఏమిటి అన్నం తిని వెళ్లదూ'

'అబ్బ ఏంగాబరావడి పోతున్నారండి,రోజూ వెళ్లే ఆఫీసుకోసం. ఒక్కరోజు వెళ్లకపోతేనేం?'

'వెడితేనేం'

'అబ్బ.....ఉండిపోదురూ'

'నిజంగా'

'నాకు అబద్ధాలు చెప్పటం రాదు'

'పోనీ నేర్పనా నేను'

ఆఫీసుకు వెళ్లమన్నా వెళ్లే స్థితిలోలేడు రామారావు అవాళ. సరోజను చూస్తూంటే అలా చూస్తూ ఉండిపోవాలనీ, తియ్యగా మాట్లాడుతూ ఉండిపోవాలనీ అనిపించింది.

మరో రెండు రోజులు కూడా ఆఫీసుకు వెళ్లలేదు. ఆ మూడు రోజులూ రామారావు ఉపన్యాసాలు దంచెయ్యనూలేదు. సరోజ చెంపలు వేసుకోనూలేదు.

మూడు రోజులూ మూడుమధురక్షణాలుగా గడచిపోయాయి. ఇంతకాలంబట్టీలేని ఆనందం ఎక్కడనుంచి పెల్లుబికి వచ్చింది? ఈ ఆప్యాయత యిప్పటిదాకా ఎక్కడ దాక్కుని ఉంది? సరోజలో యింత 'సెన్స్ ఆఫ్ హ్యూమర్', యింత పిపాస ఉందని ఎందుకు తెలియలేదు తనకి?

భర్తకు తనపైన యింత అనురాగం ఉందని తనకు యీ అయిదేళ్లబట్టీ ఎందుకు తెలియలేదు? దాంపత్యంలో యింత తీపి ఉందని ఎందుకు అనిపించలేదు? ఒక సారిగా ఉప్పెనలాగ ఏమిటిది?

రామారావు ఆఫీసులోవాళ్లంతా అతన్ని ఏదేదో అడుగుదామనీ, భ్రష్టుపట్టిద్దామని మహ

మనసు వడ్డారు. 'ఇంటర్‌వెల్'లో చుట్టు ముట్టి తలోలేక్రెప్రశ్నవేసి ఏడిపిద్దామనుకున్నారు.

రామారావు మాత్రం 'లీవ్' కాగితం అంతకు ముందే పంపించాడు గనక హెడ్‌క్లర్క్‌గాని, సూప ర్నెంటుగాని ఏమీ అనడానికి వీల్లేకపోయింది. నిర్మల మాత్రం మరీ చనువుగా పలకరించింది.

'మీరు రాకపోతే యింటికి వద్దామనిపించింది. మీకు వంట్లో ఎలా ఉందోనని'.

'రాకపోయారా.'

'నేను ఎందుకురానో మీకు తెలుసు.'

'అదికాదు మీరు రండి చెబుతాను.'

'నేను రావటంవల్ల మీరు ఘర్షణ పడటం నాకు యిష్టంలేదు. అవాళ కూడా చాలా బాధపడ్డాను. అనవసరంగా కష్టపెట్టానేమో అని.'

'మీరు పొరబడుతున్నారు. మీరు యిప్పుడు సరోజను చూస్తే అలా అనరు?'

'ఊ......అలాగేం? అయితే తప్పకుండా వస్తా. వచ్చేటప్పుడు 'స్వీట్స్' కూడా తెస్తాను'

'మీరు రండి. మీరు వస్తే 'స్వీట్స్' తెచ్చి నట్లే!

'ఊ......'

'మిమ్మల్ని చేసుకున్నవాళ్లు చాలా అదృష్ట వంతులు'

'కాదు ఆ అదృష్టం నాదే'

వాళ్ళు మాట్లాడుతూ మాట్లాడుతూ ఉండగా అప్పారావు బృందం రుస రుసా చూసి వెళ్లిపోయారు. 'ఎందుకో యీ ప్రజల కింత అసూయ' అంది నిర్మల.

'వాళ్లు ప్రజలు గనక. మనం ఎందుకో తెలియ కుండానే ప్రతి దానికీ భయపడతాం. దాన్ని అలుసుగా తీసుకుని ప్రతివాడూ భయపెడతాడు. పూచిక పుల్ల కూడా మనల్ని ఝడిపిస్తుంది. అవునా?'

'నిజమేనండి మీరు చెప్పింది' అంది నిర్మల. ఆమె కళ్లల్లో ఏదో నమ్మకం, ఉత్సాహం స్పష్టంగా కనిపిస్తున్నాయి.

రామారావు యింటికి వచ్చాడు. సరోజ నవ్వుతూ ఎదురొచ్చి పలకరించింది. ఇటూ అటూ చూస్తోంది, ఏదో పోయిన వస్తువును వెదుకుతున్నట్లుగా.

'ఏమిటి వెదుకుతున్నావు?'

'నిర్మల ఏదీ?'

'నా వెంట ఉంటుందనుకున్నావా ఎప్పుడూ?'

'ఒకేచోట పని చేస్తున్నప్పుడు ఉంటే తప్పే మిటో? అయినా అవాళ నేను కనీసం సరిగ్గా పలక రించనైనా లేదు. ఏమనుకున్నారో ఏమిటో ఆవిడ?'

'ఆ అమ్మాయి వస్తాననే అన్నది'

'మరి......మీరే తీసుకు రాలేదన్నమాట..... అవును, అవాళ మీదపడి పీకేసేలాగ మాట్లాడాను కదా!'

'అదికాదు'

'కాకపోవటమేమిటి, నా మూర్ఖత్వం అప్పుడు తెలియదుగాని, యిప్పుడు తలుచుకుంటే తెలియడం లేదా ఏమిటి?

'బాగుంది వరస'

'మీరు రేపు వచ్చేటప్పుడు తప్పకుండా తీసుకు రండి. లేకపోతే నేనే వాళ్ల యింటికి వెళ్లి బొట్టు పెట్టి పిలుచుకువస్తాను'

'అది బాగుంటుంది కూడాను'

'మిమ్మల్ని నిల్చోబెట్టే మాట్లాడుతున్నాను. టీ అయినా ఇవ్వకుండా'

'రోజూ తాగే 'టీ' ఏ గదా?'

ఆ రాత్రీ, మరో రాత్రీ, మిగతా అన్నిరాత్రులూ ఎంతో తియ్యగా గడిచాయి.

గానుగెద్దు జీవితం మారింది. రామారావు బతుకు పూర్తిగా మారిపోయిందనటంకన్నా, మార్చుకున్నా డనటం నిజం. బతుకు మామూలుగా, నిస్సారంగా అయిపోవటానికి ప్రయత్నం అనవసరం. ఆ గాడిలోంచి తప్పించి మరో బతుకుబాట వేసుకోవాలంటేమాత్రం దానంతట అది సాధ్యపడదు. సాధించాలి. వదిలేస్తే పొలం అంతా కలుపు మొక్కలువేసి చేనుని తినేసినట్లు దాని మానాన్న దాన్ని వదిలేసి, అన్నిటికీ తలఒగ్గి భయ పడితే బానిసగా మారిపోతాడు మనిషి. మనలో యించు మించు ప్రతివాడూ ఒక రామారావే. కనీసం రామారావు పాళ్ళు అయినా ఉన్నాయి మనలో చాలామందిలో. ఇది తెలుసుకున్న మరుక్షణం మనలో చాలామంది బతుకు లకి ఒక కొత్త అర్థం వస్తుంది.